క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ జ్యోతి

గుడిబండ: స్థానిక గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి అండర్–19 పోటీలకు ఎంపికయ్యారు. జ్యోతి హ్యాండ్‌బాల్, సౌమ్య షెటిల్ బ్యాడ్మింటన్, పరిణయ టేబుల్ టెన్నిస్, జయశ్రీ వాలీబాల్, హర్షిత త్రోబాల్, సుష్మిత ఖోఖో క్రీడల్లో రాష్ట్రస్థాయి అండర్–19కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. సెప్టెంబర్ 25 నుంచి 30 వరకు జరిగిన జిల్లా స్థాయి అండర్–19 పోటీల్లో ఆయా విభాగాల్లో ప్రతిభ కనబర్చడంతో వారు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందంతో పాటు తోటి విద్యార్థినులు వారిని అభినందించారు.

అంగన్‌వాడీ పోస్టులకు 46 దరఖాస్తులు

మడకశిర: మడకశిర, గుడిబండ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ పోస్టులకు పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చినట్లు సీడీపీఓ నాగమల్లేశ్వరి తెలిపారు. మడకశిర ప్రాజెక్ట్ పరిధిలో 10 సహాయకుల పోస్టులకు 25, ఒక అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు 7 దరఖాస్తులు, గుడిబండ ప్రాజెక్ట్ పరిధిలో ఒక మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు 3 దరఖాస్తులు, 2 సహాయకుల పోస్టులకు 9 చొప్పున దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. త్వరలోనే దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

ఘనంగా గాంధీ జయంతి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కేశవరావుతో పాటు అధ్యాపకులు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా శాంతియుత పోరాటాన్ని గాంధీ ఎలా చేశారో వివరించారు. అధ్యాపకులు ప్రతాప్, రామన్న, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రంగనాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటా ఆరోగ్య పరీక్షలు


ఎంపీపీ కవితకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మడకశిరరూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, సాధరణ వ్యాధులను యాప్ ద్వారా నమోదు చేయించారు. ఇందులో భాగంగానే ఆదివారం హెచ్‌పాళ్యం గ్రామంలో వైద్య సిబ్బంది ఎంపీపీ కవిత ఇంటికెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు.

దంపతులపై దాడి

పెనుకొండ: అకారణంగా ఓ యువకుడు దంపతులపై దాడి చేయడంతో వారు గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. ఎస్ఐ రమేష్‌బాబు వివరాలమేరకు... పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురంలో గుర్రప్ప, గొల్ల నరసింహప్ప అనే వ్యక్తులు ఆదివారం ఉదయం వాగ్వివాదానికి దిగారు. దీంతో సమీపంలో ఉన్న నీరగంటి మల్లికార్జున కొట్లాడుకోవద్దని సర్దిచెబుతుండగా గుర్రప్పకు సమీప బంధువైన నరేష్ తమ విషయంలో జోక్యం చేసుకుంటావా మల్లికార్జునపై దాడిచేసినట్లు ఎస్ఐ తెలిపారు. మల్లికార్జున భార్య పార్వతమ్మ అడ్డుకోవడంతో ఆమెపై సైతం దాడి చేశారన్నారు. గాయపడిన దంపతులను ఆస్పత్రికి తరలించారన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సామాజిక పింఛన్ల పంపిణీ


కెంకరలో కొత్త పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఈరన్న

అమరాపురం: మండలంలోని సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం వలంటీర్లు సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా మంజూరైన పింఛన్‌ను ఎంపీపీ ఈరన్న మానసిక స్థితి సరిగా లేకున్న హేమలతకు కెంకరలో పింఛన్ అందజేశారు.

దానిమ్మతో సిరులు

- వాణిజ్య పంటల సాగుపై రైతన్న మొగ్గు
- మడకశిర డివిజన్‌లో 1782 ఎకరాల్లో దానిమ్మ సాగు
- అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్న ప్రభుత్వం


మడకశిర ప్రాంతంలో సాగు చేసిన దానిమ్మ

మడకశిరరూరల్: వర్షాధారం కింద ప్రతి ఏడాది వేరుశనగ పంట సాగు చేస్తూ ఎంతో మంది రైతులు నష్టపోతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో బోరుబావుల కింద రైతులు వాణిజ్య పంటల్లో ఒకటైన దానిమ్మ సాగుపై ఆసక్తి పెంచుకున్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తూ లాభాల బాట పట్టారు. ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తుండటంతో అన్నదాతలకు ఏ ఇబ్బంది లేకుండా పోయింది.

1,782 ఎకరాల్లో దానిమ్మ

మడకశిర మండలంలో 706 ఎకరాలు, అగళిలో 54 ఎకరాలు, అమరాపురంలో 475 ఎకరాలు, గుడిబండలో 269 ఎకరాలు, రొళ్లలో 278 ఎకరాల చొప్పున మొత్తం 1,782 ఎకరాల్లో రైతులు దానిమ్మ పంటను సాగు చేశారు. గత నాలుగేళ్ల నుంచి మడకశిర మండలంలోని చెరువులను కృష్ణాజలాలు నింపడంతో పాటు భారీగా కురిసిన వర్షాలకు చెరువులు నిండాయి. బోరు బావుల్లో నీటి మట్టం పెరగడంతో పుష్కలం నీరు వస్తున్నాయి. దీంతో రైతులు వాణిజ్య పంటలను సాగుకు మొగ్గుచూపుతున్నారు. మార్కెట్‌లో టన్ను దానిమ్మ కాయలు రూ.లక్ష నుంచి రూ.1.30 లక్షల వరకు ధర పలుకుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు సూచనలు, సలహాలు

రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయిలో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా పంట సాగులో తీసుకోవాల్సిన సూచనలు, సలహాలను రైతులకు వివరిస్తున్నారు. వ్యవసాయ, అనుబంధ పంటల సాగులో రైతులకు లాభాదాయకంగా మార్చడమే లక్ష్యంగా ఆర్బీకే సిబ్బంది కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగానే తెగుళ్ల నివారణకు సూచనలు, సలహాలిస్తున్నారు. అలాగే దానిమ్మ పంట దెబ్బతిన్న రైతు నష్టపోకుండా ప్రభుత్వం ఉచిత వైఎస్సార్ పంటల బీమా సౌకర్యం కల్పిస్తూ భరోసా ఇస్తోంది.


రైతు దొడ్డయ్యకు చెందిన తోటలో చెట్టుకు విరగ్గాసిన దానిమ్మ కాయలు

ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు

ప్రభుత్వం కూడా పండ్ల తోటల సాగుకు అధికంగా సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందిస్తుండటంతో రైతులు దానిమ్మ సాగు చేయడానికి ముందుకొస్తున్నారు. డ్రిప్ పరికరాలు అందించడం వల్ల రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారింది. దీనికి తోడు కొత్తగా దానిమ్మ పంట సాగు చేసే రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా మూడేళ్ల మొక్కల సంరక్షణకు రైతుకు పైసాఖర్చు లేకుండా ప్రభుత్వమే బిల్లు చెల్లుస్తుండటం రైతులకు ఎంతో కలసి వస్తోంది.

రూ.50 లక్షలకు పైగా ఆదాయం



బోరు బావుల కింద సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ డ్రిప్ ద్వారా ఐదు ఎకరాల్లో దానిమ్మ సాగు చేశాను. దీంతో ప్రతి ఏడాది ఆదాయం పొందుతున్నాను. పంటకు తెగుళ్ల వ్యాప్తి లేక కాయలు మంచి సైజులో ఉన్నాయి. మార్కెట్‌లో మంచి ధర ఉండడంతో ఈ ఏడాది దానిమ్మ పంటకు పెట్టిన ఖర్చులు పోనూ రూ.50 లక్షలకు పైగా ఆదాయం పొందుతున్నాను.
– దొడ్డయ్య, రైతు, ఉపొర్లపల్లి

రూ.30 లక్షలకుపైగా ఆదాయం



వేరుశనగ పంటసాగు చేసి ప్రతి యేటా నష్టాలు చవిచూసేవాడిని. కృష్ణాజలాలలో పాటు కురిసిన వర్షాలకు చెరువులు నిండటంతో బోరు బావుల్లో సమృద్ధిగా నీరు వస్తున్నాయి. సేంద్రీయ పద్ధతులను పాటిస్తూ డ్రిప్ ద్వారా ఎనిమిది ఎకరాల్లో దానిమ్మ పంటను సాగు చేశాను. మార్కెట్‌లో మంచి ధర ఉంది. ఈ ఏడాది ఖర్చులు పోనూ దానిమ్మ పంటలో రూ.30 లక్షలకు పైగా ఆదాయం వచ్చింది. దానిమ్మ పంట ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాను. – రంగస్వామి, రైతు, అయ్యవారిపల్లి

దానిమ్మ విస్తీర్ణం పెరిగింది



మడకశిర నియోజకవర్గంలో గతం కంటే దానిమ్మ పంట సాగు విస్తీర్ణం పెరిగింది. బోరు బావుల్లో పుష్కలంగా నీరు వస్తుండటంతో రైతులు వాణిజ్య పంటలను సాగు చేస్తున్నారు. ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు సూచనలు, సలహాలను అందిన్నాం. మడకశిర డివిజన్ పరిధిలో 1782 ఎకరాల్లో దానిమ్మ పంటను సాగు చేశారు.
– చిన్నరెడ్డయ్య, ఉద్యానశాఖ అధికారి, మడకశిర

టీడీపీది ఉత్తుత్తి ప్రచారమే

పెనుకొండరూరల్: టీడీపీది ఉత్తుత్తి ప్రచారమేనని వైస్ ఎంపీపీ రామాంజినేయులు తెలిపారు. ఆదివారం పెనుకొండ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి స్వగృహంలో ఎర్రమంచి పంచాయతీ కురుబవాండ్లపల్లికి చెందిన నాలుగు కుటుంబాలు టీడీపీలో చేరాయన్నారు. అయితే 25 కుటుంబాలు చేరాయని సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేయించడం హాస్యాస్పదమన్నారు. 21 కుటుంబాలు గతంలో టీడీపీలో ఉన్నవారేనని, వారికే కండువాలు కప్పి ప్రచారం చేయిస్తున్నారన్నారు.

బీఎస్పీతోనే బహుజనులకు రాజ్యాధికారం


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పెనుకొండ: బీఎస్పీతోనే బహుజనులకు రాజ్యాధికారం సిద్ధిస్తుందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు హనుమంతు పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం బీఎస్పీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ సర్కిల్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, లక్ష్మినారాయణ, నారాయణప్ప, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

పరిగి: మండలంలోని నేతులపల్లి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాలమేరకు.. పరిగి వైపు నుంచి హిందూపురం వైపు వెళ్లే రోడ్డుపై ఓ గుర్తు తెలియని వాహనం ముందువైపుగా వెళ్తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఒకదాని తరువాత ఒకదాన్ని ఢీ కొట్టింది. దీంతో బైకులపై వెళ్తున్న హిందూపురానికి చెందిన నురుల్లా, గోరంట్ల మండలం పాలసముద్రానికి చెందిన నరేష్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్షతగాత్రులిద్దరూ మడకశిర ప్రాంతంలో మెకానిక్‌లుగా పనిచేస్తున్నారని తెలిసింది. ప్రమాదానికి సంబంధించి తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

అలరించిన గాంధార విద్య


కళ్ల గంతలు కట్టుకొని అక్షరాలు గుర్తిస్తున్న చిన్నారులు

పెనుకొండ: పట్టణంలో ఆదివారం జరిగిన గాంధార విద్య పట్టణ వాసులను ఆకట్టుకుంది. హర్ష, మాధురి అనే చిన్నారులు కళ్లకు గంతలు కట్టుకుని బొమ్మలు, అక్షరాలు, చివరకు సెల్‌ఫోన్‌లోని సమాచారాన్ని చెప్పడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది. స్థానిక ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ సమీపంలో గాంధార విద్యను డాక్టర్ నీలిమారెడ్డి, భాను, విజయశాంతి ఆధ్వర్యంలో ప్రదర్శించారు. చిన్నారులు హర్ష, మాధురిలను పలువురు అభినందించారు. చిన్నారులు కోర్సులో చేరదలిస్తే ఫోన్ నంబర్ 7337510833ను సంప్రదించాలన్నారు.

వ్యక్తికి గాయాలు

నల్లచెరువు: ప్యాయలవాండ్లపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్యాయలవాండ్లపల్లికి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. శ్రీనివాసులు వ్యక్తిగత పని నిమిత్తం ఆదివారం తన ద్విచక్ర వాహనంలో కదిరికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ప్యాయలవాండ్లపల్లి సమీపంలోకి రాగానే కర్ణాటక రాష్ట్రం నుంచి కదిరి వైపు వెళ్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాసులు కాలికి తీవ్ర గాయమైంది. స్థానికులు అతడ్ని 108 వాహనంలో కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

విద్యార్థిని కిడ్నాప్‌పై ఫిర్యాదు

ఎన్పీకుంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మండల కేంద్రానికి చెందిన ఓ విద్యార్థినిని ధర్మవరానికి చెందిన దాసరి వెంకటేష్ కిడ్నాప్ చేసినట్లు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆదివారం సాయంత్రం తన కుమార్తెను (9వ తరగతి విద్యార్థిని) దాసరి వెంకటేష్ ద్విచక్ర వాహనంలో తీసుకెళ్లాడని తండ్రి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం


పెనుకొండ: వృద్ధులను సన్మానించిన దృశ్యం


అగళి: తహసీల్దార్ జమానుల్లాఖాన్ ఆధ్వర్యంలో వృద్ధులకు సన్మానం


పరిగి: వృద్ధులను సన్మానిస్తున్న తహసీల్దారు సౌజన్యలక్ష్మి

పెనుకొండ: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఆవరణంలోని భువన విజయం సమావేశపు భవనంలో ఘనంగా నిర్వహించారు. సబ్‌కలెక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో 80 సంవత్సరాలు నిండిన వృద్ధులను సన్మానించారు. కార్యక్రమంలో పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పావగడ: జాతిపిత గాంధి జయంతి సందర్భంగా స్థానిక స్వాతంత్ర్య సమర యోధుడు వీఎస్ రెడ్డిని స్థానిక తహసీల్దార్ వరదరాజు సన్మానించారు. ఆదివారం వీఎస్ రెడ్డి గృహానికి వెళ్లి ఆయన్ను పులమాలలు, శాలువాతో సత్కరించారు. మరోవైపు తాలూకా వ్యాప్తంగా 47 మంది శతాధిక వృద్ధులను గుర్తించి ఆయా గ్రామ పంచాయతీ అధికారులు వారిని ఘనంగా సన్మానించారు.

పరిగి: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు భారతీయ ప్రజల వజ్రాయుధమని తహసీల్దారు సౌజన్యలక్ష్మి తెలిపారు. ఆదివారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పరిగి తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత 80 ఏళ్ల పైబడిన వారిని సన్మానించి, ఓటు హక్కు విశిష్టతను వివరించారు.

అగళి: మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 80 ఏళ్ల నిండిన వృద్ధులను సన్మానించారు. తహసీల్దార్ జమానుల్లాఖాన్ తదితరులు వృద్ధులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

అమరాపురం: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం 80 సంవత్సరాలు నిండిన వృద్ధులను రెవెన్యూ సిబ్బంది సన్మానించారు. వృద్ధులు మాట్లాడుతూ ఈ వయస్సులో తమను కార్యాలయానికి తీసుకెళ్లి తమను సన్మానించడం ఆనందకరమన్నారు.

రొళ్ల: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ హసీనాసుల్తానా ఆధ్వర్యంతో 80 ఏళ్ల పూర్తి చేసుకున్న వృద్ధులను ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో డీటీ భాగ్యలక్ష్మి, ఆర్ఐ మంజునాథ్, వీఆర్వోలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదర్శన


పూల రథంపై రంగనాథస్వామి, శ్రీదేవి, భూదేవి

హిందూపురం: పట్టణంలోని గుడ్డం రంగనాథ స్వామి ఆలయ గిరి ప్రదర్శన ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం రంగనాథస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవ మూర్తులను పూల రథంపై కొలువుదీర్చి గిరి ప్రదర్శన నిర్వహించారు.

చౌడేశ్వరిదేవి సేవలో శ్రీలత


తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్న రాష్ట్ర తొగట వీర క్షత్రియ సంఘం మహిళా అధ్యక్షురాలు శ్రీలత

హిందూపురం అర్బన్: మండలంలోని కొటిపి గ్రామంలో వెలసిన చౌడేశ్వరీదేవి ఆలయాన్ని ఆదివారం రాష్ట్ర తొగట వీర క్షత్రియ సంఘం మహిళా అధ్యక్షురాలు సురువు శ్రీలత సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


ఎమ్మెల్యే శంకరనారాయణ సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరుతున్న రెడ్డిచెరువుకట్ట గ్రామస్తులు

గోరంట్ల: మండలంలోని కొండాపురం గ్రామ పంచాయతీ రెడ్డిచెరువుకట్ట గ్రామానికి చెందిన బేల్దారి బావయ్య కుమారులు శంకర్, నరేష్ , కుమార్‌తో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారంపెనుకొండలోని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ క్యాంప్ కార్యాలయానికి వారు తరలివెళ్లారు. ఎమ్మెల్యే శంకరనారాయణ వారి మెడలో వైఎస్సార్‌సీపీ కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, కొండాపురం పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులు రమణ, జయచంద్రారెడ్డి, ఆనంద్, గోవిందరెడ్డి, ఉత్తమరెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

రొళ్ల: మండలంలోని టీడీ పల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలసిన సిద్దేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా భక్తులు ఆలయాన్ని నీటితో శుభ్రం చేసి పూలతో అలంకరించారు. అనంతరం స్వామివారి మూల విగ్రహాన్ని గంగా జలంలో శుద్ధి చేసి అభిషేకించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా నియమించిన అర్చకుడితో స్వామివారి మూల ప్రతిమకు వెండి ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి మహా మంగళారతి ఇచ్చారు. ప్రత్యేక పూజ రోజు కావడంతో స్వామి వారిని కొలిచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కొందరు భక్తులు ఆలయ ఆవరణలో వంటకాలు చేసి స్వామివారి ఎదుట నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


మొక్కజొన్న పంట నాశనం



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు


పావగడ: కోతకు వచ్చిన మొక్కజొన్న పంటను దుండగులు నాశనం చేసిన ఘటన నిడుగల్ హోబళి కోటగుడ్డ గ్రామ పంచాయతీ అరెక్యాతనహళ్లి గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత రైతు మహిళ కరియమ్మ వివరాలమేరకు.. తన కున్న రెండు ఎకరాల భూమిలో మొక్కజొన్న సాగు చేసినట్లు చెప్పారు. అయితే చేతికొచ్చిన పంటను దుండగులు శనివారం రాత్రి అర ఎకరాలో నాశనం చేశారని వాపోయారు. ఏఎస్ఐ నరసింహమూర్తి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పలువురికి అస్వస్థత

హిందూపురం అర్బన్: మండలంలోని సుబ్బారెడ్డిపల్లిలో శనివారం రాత్రి నుంచి గ్రామంలో పలువురికి వాంతులు, విరేచనాలతో హిందూపురం ఆస్పత్రిలో చేరారు. 15 మంది ఆస్పత్రిలో చేరగా ఆదివారం 10 మంది వరకూ డిశ్చార్జ్ అయ్యారు. మిగిలిన వారికి కూడా ఇబ్బంది లేదని వైద్యులు తెలిపారు.



హిందూపురం: పిచ్చి మొక్కల తొలగింపులో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి


లేపాక్షి: నవోదయ విద్యాలయంలో శ్రమదానం చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు


పెనుకొండ: గాంధీ సర్కిల్ శుభ్రం చేస్తున్న ప్రజాప్రతినిధులు, కార్మికులు

స్వచ్ఛత వైపు అడుగులు

'పల్లెలే ప్రగతికి పట్టుకొమ్మలు.. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రాలు, దేశాలు అభివృద్ధికి సూచికగా నిలుస్తాయి' అన్న మహాత్మాగాంధీ ఆకాంక్ష మేరకు ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ ఈ కార్యక్రమం చేశారు. మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాన వీధులు, అంగనవాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల వద్ద పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టారు. మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. – సాక్షిబృందం


పరిగి: సేవామందిరం కూడలిలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం


అగళి: నృత్య రూపంలో ప్రతిజ్ఞ చేస్తున్న కేజీబీవీ విద్యార్థులు


గుడిబండ: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు